బోనాలు సమర్పించి..

మొక్కులు చెల్లించి..!

అంగరంగ వైభవం..

బోనాల ఉత్సవం



అంబర్‌పేట మహంకాళి ఆలయంలో కొలువుతీరిన అమ్మవారు

తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలను దశదిశల తెలియజేసే బోనాల పండగను ఆదివారం భక్తులు అంగరంగ వైభవంగా నిర్వహించుకున్నారు. ప్రతి ఇంట్లో అమ్మవారికి నైవేద్యం కోసం పరమాన్నం, తోటకూర, పచ్చిపులుసు వండి కుటుంబ సమేతంగా అమ్మవారి ఆలయాలకు వెళ్లి సాకపెట్టి బోనాలు సమర్పించారు. చల్లంగా చూడాలంటూ అమ్మవారిని మొక్కుకున్నారు. మహిళలు సంప్రదాయ వేషధారణలో బోనాలు ఎత్తుకుని ఊరేగింపుగా అమ్మవారి ఆలయాలకు చేరుకున్నారు. డప్పు దరువుల మధ్య అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఆలయాల పరిసరాల్లో ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంది. అంబర్‌పేట/ముషీరాబాద్ నియోజకవర్గాల్లోని ప్రతి గల్లీలో బోనాల సందడి కనిపించింది. ఆలయాలు భక్తులతో కళకళలాడాయి. ఎటు చూసినా పూలతో ముస్తాబైన ఆలయాలు, ఇంటి గుమ్మాలు... ఎక్కడున్నా వినిపించే జానపద గీతాలతో గల్లీలు, బస్తీలు, ఆలయాల పరిసరాలు జాతరను తలపించాయి.

– అంబర్‌పేట/ముషీరాబాద్ జోన్ బృందం



చెప్పల్‌బజార్‌లో యంగ్‌మెన్ అసోసియేషన్ ఫలహారం బండి అమ్మవార



అమ్మవారి పూజలో దంపతులు





అంబర్‌పేట మహంకాళి అమ్మవారి ఆలయంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి దంపతులు, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్, సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు ఎనుముల కృష్ణారెడ్డి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ దంపతులు, గవర్నర్ బండారు దత్తత్రేయ



ముషీరాబాద్‌లో బోనంతో తల్లీకూతుళ్లు











బతుకమ్మకుంటలో మైసమ్మ అమ్మవారి ఆలయంలో కార్పొరేటర్ పద్మా వెంకట్‌రెడ్డి



అమ్మవారి బోనంతో కుటుంబ సమేతంగా..



అమ్మవారికి బోనం సమర్పించడానికి వెళ్తున్న కాంగ్రెస్ నేత తొలుపునూరి కృష్ణగౌడ్



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న టీఆర్టీ కాలనీ నల్లపోచమ్మ ఆలయ కమిటీ ప్రతినిధులు



మహంకాళి ఆలయంలో జరిగిన పూజలో బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి ఎడ్ల సుధాకర్‌రెడ్డి



బోనంతో గోల్నాక కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్



బాకారం పోచమ్మ దేవాలయంలో మాజీ కార్పొరేటర్లు రాంబాబు, పులి జగన్, రమేష్, ఆలయ చైర్మన్ సందీప్‌గౌడ్



మేడిబావి బస్తీలో పూజలు నిర్వహిస్తున్న ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియనవీన్‌గౌడ్ తదితరులు



గాంధీనగర్‌లో కాంగ్రెస్ నేత గుర్రం శంకర్, గుర్రం చంద్రకళ ఆధ్వర్యంలో బోనం సమర్పిస్తున్న జోగిని శ్యామల



మహంకాళి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



అడిక్‌మెట్‌లోని గణేష్‌నగర్ బోనాల వేడుకల్లో టీజేఎస్ గ్రేటర్ అధ్యక్షుడు ఎం.నర్సయ్య



అమ్మవారి పూజలో పాల్గొన్న ముషీరాబాద్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు,పూస రాజు



శాస్త్రీపురంలో బీఆర్‌ఎస్ నేత నాగేష్‌ను సత్కరిస్తున్న ఆలయ కమిటీ నిర్వహకులు



అడ్వకేట్స్‌కాలనీలోని బాలత్రిపుర సుందరీదేవి ఆలయ బోనాల్లో ఆలయ చైర్మన్ టి.రవీందర్



గవర్నర్ దత్తాత్రేయతో బీజేపీ రాష్ట్ర నేత శేషసాయి



గాంధీనగర్‌లో అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న కార్పొరేటర్ దంపతులు పావనివినయ్‌కుమార్ తదితరులు



అమ్మవారికి బోనం సమర్పించేందుకు బోనాలతో వెళుతున్న గ్రీన్ రిచ్ రెసిడెన్సీ మహిళలు



పూజలో మాజీ కార్పొరేటర్ వనం రమేష్



బోనంతో కాంగ్రెస్ నేత అంజిరెడ్డి కుటుంబీకులు



నింబోలిఅడ్డలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని సత్కరిస్తున్న ఆలయ ధర్మకర్త రాజేందర్



గోల్నాకలో పూజలు చేస్తున్న కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్



బర్కత్‌పురలో దుర్గా ఆలయంలో పూజలు చేసిన సీఎం సోదరుడు ఎనుముల కృష్ణారెడ్డి



పటేల్‌నగర్ చౌరస్తాలోని అమ్మవారికి బోనాలు సమర్పిస్తూ..

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బోనాలు

మాజీ ఉపరాష్ట్రపతి
ఎం.వెంకయ్యనాయుడు



ముషీరాబాద్: ఆషాఢమాసంలో హైదరాబాద్‌లో జరిగే బోనాలు తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. బోనాల పండుగ సందర్భంగా తెలుగు ప్రజలందరూ సుఖ సంతోషాలతో పాడిపంటలతో విరసిల్లాలని అమ్మవారిని కోరినట్లు ఆయన తెలిపారు. హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆధ్వర్యంలో రాంనగర్‌లోని తన నివాసంలో ఆదివారం నిర్వహించిన బోనాల పండగకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై పూజలు చేశారు. అనంతరం వెంకయ్యనాయుడు మాట్లాడుతూ.. బోనాల వేడుకల్లో తాను పాల్గొనడం సంతోషం కలిగించిందన్నారు. ఈ ఉత్సవాలకు దత్తాత్రేయ తనను ఆహ్వానించడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ కుమార్తె, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి బండారు విజయలక్ష్మి ఆయనను సత్కరించారు. ఈ వేడుకల్లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్, బీజేపీ ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఎన్.రాంచందర్‌రావు, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీజేపీ కార్పొరేటర్ కె.రవిచారి, సుప్రియానవీన్‌గౌడ్, పావని వినయ్, రచనశ్రీ, బీజేపీ సికింద్రాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎస్.గౌతమ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సీతక్కకు ఆహ్వానం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ బాలోత్సవం ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థుల్లో ఉత్తమ మార్కులు సాధించిన వారికి ఆగస్టు 8న బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నారు. ఈ సందర్భంగా బాలోత్సవం కార్యదర్శి నల్లపు సోమయ్య, కోశాధికారి బుచ్చిరెడ్డిలు మంత్రి సీతక్కను కలిసి సభకు ముఖ్యఅతిథిగా హాజరుకావాలని ఆహ్వానించారు. ప్రభుత్వ బడి పిల్లలు ప్రతిభగల పిడుగలని సర్కారు బడి కన్నతల్లి ఒడిగా భావించి నిరంతరం బాలోత్సవం తరపున వారిని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లల్లో దిగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి తమ వంతుగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తే వారు ఎవరికి తీసిపోరని అన్నారు. వేయి మంది ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు అందజేస్తున్నట్లు తెలిపారు.



ప్రతిభా పురస్కారాల సభకు మంత్రి సీతక్కను ఆహ్వానిస్తున్న తెలంగాణ బాలోత్సవం ప్రతినిధులు

ఢిల్లీ ముఖ్యమంత్రిని వెంటనే విడుదల చేయాలి

- 30న ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద నిరసన
- ఆప్ తెలంగాణ కన్వీనర్ డా. దిడ్డి సుధాకర్



కవాడిగూడ: ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అరెస్టును నిరసిస్తూ జూలై 30న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద రాష్ట్ర ఇండియా కూటమి పార్టీల ఆధ్వర్యంలో నిరసన చేపట్టనున్నట్లు తెలంగాణ ఆమ్ ఆద్మీపార్టీ కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ తెలిపారు. దేశ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా ఈడీ, సీబీఐలను ఉపయోగించుకుని కేంద్రం హింసిస్తోందన్నారు. బీజేపీని ప్రశ్నించే వారిని అక్రమ అరెస్టులు చేసి జైలులో పెడుతున్నారని విమర్శించారు. ఎలాంటి సాక్ష్యాలు లేకుండా ఈడీ, సీబీఐలను ఉపయోగించుకుని కేజ్రీవాల్‌ను చంపడానికి ప్రయత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సంఘాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని నిరసనను విజయవంతం చేయాలని కోరారు.

పోచమ్మ దేవాలయ ముఖ ద్వారం ప్రారంభం



ఆలయ ముఖ ద్వారాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు

ముషీరాబాద్: జంట నగరాల మహేంద్ర సంఘం అధ్యక్షుడు రేషం మల్లేష్ తన తండ్రి రేషం కిష్టయ్య జ్ఞాపకార్థం రాంనగర్ డివిజన్‌లోని మేదర బస్తీలోని పోచమ్మ దేవాలయ ముఖద్వారాన్ని నిర్మించారు. ఆదివారం ఎమ్మెల్యే ముఠా గోపాల్, రాంనగర్ మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి, జైసింహ ముఖ్యఅతిథులుగా హాజరై ఆలయ కమాన్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రేషం మల్లేష్ తల్లి లక్ష్మి, సోదరుడు వినోద్‌కుమార్, కుమారుడు మణికంఠ, అల్లుడు సాయికిరణ్, సిరిగిరి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

నల్లకుంట: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ఓ మొక్కను నాటి సంరక్షించాలని మైనార్టీ మోర్చా మీడియా కన్వీనర్ ఎం. ఐజాక్‌రాజ్ పిలుపునిచ్చారు. ఆదివారం టీవీలో ప్రసారమైన ప్రధాని మన్ కీ బాత్ ప్రత్యక్ష ప్రసారాన్ని నల్లకుంటలోని కార్యాలయంలో ఆయన వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాని పిలుపు మేరకు తన కన్న తల్లి పేరు మీద మొక్కను నాటుతానని అన్నారు.

గురు వందన సభ



ప్రముఖ సంగీత విధ్వాంసుడు గౌరీభట్ల లక్ష్మణామూర్తిని సన్మానిస్తున్న చిన దృశ్యం

నల్లకుంట: గురు పౌర్ణమిని పురస్కరించుకొని ఆదివారం సాయంత్రం నల్లకుంట, కొత్తపేటలోని శ్రీ సాయి శృతి మ్యూజిక్ అకాడమీలో 'గురు వందన సభ' నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ సంగీత విధ్వాంసుడు గౌరీభట్ల లక్ష్మణ మూర్తిని అకాడమీ తరపున శాలువాతో సన్మానించారు. అనంతరం లక్ష్మణామూర్తి, యామిని బృందంతో కలిసి చేసిన కీర్తనల గానం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో అకాడమీ డైరెక్టర్ గౌరీభట్ల వసుధామూర్తి, గాయకులు యామిని, నందిని, విద్యార్థులు పాల్గొన్నారు.

బీసీ కులాల లెక్కలు తేలాల్సిందే

పంజగుట్ట: రాష్ట్రంలో కుల జనగణన చేసి బీసీల లెక్కలు తేల్చితేనే ఆర్థికం, రాజకీయం, సామాజికంగా బీసీలకు న్యాయం జరుగుతుందని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి పూర్ణచంద్రరావు అన్నారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బీసీ సమాజ్ ఆధ్వర్యంలో బీసీ సమాజ్ వ్యవస్థాపకులు సంగెం సూర్యారావు, ఓర్సు కృష్ణయ్యల అధ్యక్షతన బీసీ కులాల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్ణచంద్రారావు మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీల లెక్కలు తేల్చితేనే ఎంత మంది అగ్రకులాల వారు, ఎంతమంది బీసీలు ఉన్నారో ప్రజలకు తెలుస్తుందన్నారు.

క్షమాపణ చెప్పకుంటే హరీష్‌రావును తిరుగనివ్వం

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు వెంకన్నగౌడ్



కాచిగూడ: ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం మంత్రి పదవిని తృణప్రాయంగా వదిలేసి ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ఆమరణ నిరాహార దీక్ష చేసిన రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిపై 'హాఫ్ నాలెడ్జ్' అంటూ బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి హరీష్‌రావు చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నానని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు గండిచెరువు వెంకన్నగౌడ్ అన్నారు. ఆదివారం కాచిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తక్షణమే మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాష్ట్రంలో ఎక్కడ తిరిగినా ఎక్కడికక్కడ హరీష్‌రావును అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నేతలు నేరేటి మల్లేష్ యాదవ్, ఈర్ల లింగస్వామియాదవ్, చామకూరి శంకర్, పుట్ట రాకేష్ ముదిరాజ్, నకిరేకంటి అజయ్, దేవేందర్ పాల్గొన్నారు.

రైలులో చోరీ.. జీరో ఎఫ్‌ఐఆర్ నమోదు

కాచిగూడ: రైలులో ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్, బంగారు గొలుసున్న బ్యాగు చోరీపై కాచిగూడ రైల్వే పోలీసులు జీరో ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... ఉప్పల్, చిలుకానగర్ ప్రాంతానికి చెందిన ప్రైవేట్ ఉద్యోగి ఆర్.రాజు ఈనెల 22న కాచిగూడ నుంచి బెంగుళూర్‌కు మైసూర్ ఎక్స్‌ప్రెస్ రైలులో వెళ్లాడు. బెంగుళూర్ వెళ్లాక చూసుకునే సరికి ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్, ఆరు గ్రాముల బంగారు గొలుసు, క్రెడిట్ కార్డు ఉన్న బ్యాగు కనబడలేదు. ఆదివారం బాధితుడి ఫిర్యాదు మేరకు కాచిగూడ రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం బెంగుళూర్ రైల్వే పోలీసులకు బదిలీ చేశారు.